నాణ్యమైన విద్యనందించాలి

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలను కల్పించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. దర్గామిట్టలోని సంక్షేమ గిరిజన బాలికల గురుకుల పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందిస్తున్న భోజనం, మెనూ, వసతి సౌకర్యాలపై హెచ్‌ఎం విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు పట్టిక, పలు రిజిస్టర్లు, స్టోర్ రూమ్, విద్యార్థుల గదులు తదితరాలను పరిశీలించారు. ఆరు, పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలలను పరీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. రోజువారీ సిలబస్‌తో పాటు విద్యార్థులకు కనీస విషయ పరిజ్ఞానం ఉండేలా ప్రత్యేకంగా స్టడీ అవర్స్‌ను నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వసతి గృహానికి అవసరమైన మరమ్మతు పనులను పాఠశాల నిర్వహణ ఫండ్ ద్వారా చేపట్టాలని చెప్పారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పరిమళ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆనంద్

నేరాలను కట్టడి చేయాలి

• ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): నేరాలను కట్టడి చేసి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందించాలని ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు. దర్గామిట్ట, వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు చేపడుతున్న చర్యలు.. సిబ్బంది యోగక్షేమాలను ఆరాతీశారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. చోరీ ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు సొత్తును రికవరీ చేయాలని చెప్పారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.


మాట్లాడుతున్న కృష్ణకాంత్

నెల్లూరు నగర, రూరల్, ఎస్బీ డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు రోశయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గాడితప్పిన విద్యారంగాన్ని కాపాడుకోవాలి

నెల్లూరు(అర్బన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో గాడితప్పిన విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు ఉపాధ్యాయులు ఐక్యంగా పోరాడాలని యూటీఎఫ్ రాష్ట్ర నేత, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని గాంధీబొమ్మ నుంచి మాగుంట లేఅవుట్లోని కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీని ఉపాధ్యాయులు శనివారం నిర్వహించారు. కార్యాలయంలో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. తొలుత సంఘ వ్యవస్థాపక నేతల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. విద్యారంగ ఉన్నతి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ఎన్నో పోరాటాలు చేసిందని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో విద్యారంగం బలోపేతమయ్యేందుకు ఉపాధ్యాయులందరూ ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ, అధ్యక్షుడు శేషు, రాష్ట్ర పూర్వ కార్యదర్శులు పరంధామయ్య, శ్రీహరి, సుబ్బారావు, వెంకటయ్య, గోపాల్, చలపతి, రసూల్ తదితరులు పాల్గొన్నారు.


నేతల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం తదితరులు

రైతులకు పుష్కలంగా సాగునీరివ్వాలి

• మంత్రులు నారాయణ, ఆనం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని రైతులకు ఇబ్బందుల్లేకుండా సాగునీటిని అందించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతి, సాగునీటి కాలువల స్థితిగతులపై సోమశిల, తెలుగుగంగ, కండలేరు ప్రాజెక్టుల ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నగరంలోని జెడ్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సోమశిల జలాశయ రక్షణ కోసం చేపడుతున్న పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. గేట్ల రోప్స్, హెడ్ రెగ్యులేటర్ పనుల మంజూరుకు గానూ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్, ఆర్థిక శాఖ కార్యదర్శులతో ఫోన్లో మాట్లాడి అనుమతులను త్వరగా మంజూరు చేయించాలని కోరారు. సోమశిలకు నీరొచ్చేలోపే అప్రాన్ పనులను పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. సోమశిల అభివృద్ధి పనులకు సరిపడా ఇసుకను ముందుగానే సిద్ధం చేసుకొని స్టాక్ పాయింట్‌ను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. 18 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం కాగా, దీనికి కలెక్టర్ అనుమతిచ్చారన్నారు.


మాట్లాడుతున్న మంత్రులు

పూడికతీత పనులు చేపట్టాలి

పంట కాలువల్లో పూడికతీత, గుర్రపు డెక్క తొలగింపు పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ప్రారంభించి సాగునీరు సాఫీగా అందించాలని చెప్పారు. అనంతరం కలెక్టర్ ఆనంద్ మాట్లాడారు. పెన్నాకు గతంలో ఐదు లక్షల క్యూసెక్కులకుపైగా వరద వచ్చిందని, ఆ సమయంలో చాలా చోట్ల కట్టలు దెబ్బతిన్నాయని చెప్పారు. వీటిని గుర్తించి కట్టలను ఇసుక బస్తాలు, ఇతర ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి పూడ్చాలని ఆదేశించారు. కావలి, కందుకూరు, వెంకటగిరి ఎమ్మెల్యేలు కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కురుగొండ్ల రామకృష్ణ, ఎస్ఈలు రమణారెడ్డి, బీవీ రమణారెడ్డి, కృష్ణమోహన్, డిప్యూటీ కలెక్టర్లు ప్రేమ్‌కుమార్, చిన్న ఓబులేసు, డీఎఫ్ఓ చంద్రశేఖర్, ఆత్మకూరు ఆర్డీఓ మధులత తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే దేశ భవిష్యత్తు

నెల్లూరు (టౌన్): దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉంటుందని వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు పేర్కొన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలకు బలి కాకుండా యువత జాగ్రత్త పడాలని కోరారు. మత్తు రహిత దేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం మత్తు పదార్థ రహిత దేశాన్ని నిర్మిద్దామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఆర్ఐఓ శ్రీనివాసులు, ఎన్నెస్సెస్ వర్సిటీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, ఎన్నెస్సెస్ కళాశాల ప్రోగ్రామ్ అధికారులు కరుణ కుమారి, ప్రసన్న, భారతి, అధ్యాపకులు రవీంద్రనాథ్, రమణారెడ్డి, వెంకట్రావు, శ్రీధర్, పూర్ణచంద్ర కుమారి తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

హృద్రోగ వ్యాధులపై అవగాహన

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): హృద్రోగ సంబంధిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్స్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ సాహెబ్ పీర్ మాట్లాడారు. వ్యాధిపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ సుబ్బరాజు, కార్యదర్శి రమేష్ బాబు, కోశాధికారి జయదేవ్, అసోసియేషన్ వ్యవస్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, చింతల అమరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు



అ'పూర్వ' సమ్మేళనం

నెల్లూరు సిటీ: ఏఎస్‌పేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1982 – 83 మధ్య చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. నాటి స్మృతులను నెమరేసుకున్నారు. నగరంలోని మినర్వ గ్రాండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాగిరెడ్డి, రేణుక, శ్రీనివాసులు, సులోచన తదితరులు పాల్గొన్నారు.



హామీలను అమలు చేయాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వడ్డెర వృత్తిదారుల సంఘ రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ డిమాండ్ చేశారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల తరహాలోనే వడ్డెర్లకు సామాజిక రక్షణ చట్టం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 90 శాతం సబ్సిడీపై పరికరాలను అందజేయాలని కోరారు. వచ్చే నెల 14, 15వ తేదీల్లో రాష్ట్ర మహాసభలను నిర్వహించేందుకు కమిటీ తీర్మానం చేసింది. నేతలు చల్లా వెంకటయ్య, బాలవెంకటేశ్వర్లు, నాగరాజు, రత్తయ్య, అశోక్, నాగార్జున, సింహగిరి, రమణ, గంగయ్య, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దయాకర్

శాంతియుత ర్యాలీ రేపు



నెల్లూరు(బృందావనం): దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలని కోరుతూ నగరంలో శాంతియుత నిరసన ర్యాలీని సోమవారం నిర్వహించనున్నామని ఆర్సీఎం బిషప్ మోస్ట్ రెవరెండ్ ప్రకాశం తెలిపారు. సంతపేట రోమన్ క్యాథలిక్ మిషన్ క్యాథెడ్రల్‌లోని బిషప్ హౌస్‌లో క్రైస్తవ సంఘాల నేతలతో సమావేశాన్ని ఎస్సీ, బీసీ కమిషన్ సెక్రటరీ ఫాదర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వీఆర్సీ గ్రౌండ్స్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించనున్న ర్యాలీకి తరలిరావాలని కోరారు. ఎలీషాకుమార్, దయాసాగర్, ఏసురాజ్యం, ఏసురత్నం, ఊరందూరు సురేంద్రబాబు, రాజశేఖర్ దాసరి, హనోక్, రాయపాటి హృదయ్‌కుమార్, జాషువా, శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!



నగరంలో పారిశుధ్యం పడకేసింది. అనేక ప్రాంతాల్లో రోడ్ల పక్కన చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. వీటిని తరలించడంలో జాప్యం చేస్తుండటంతో కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ క్రమంలో రాకపోకలు సాగించే పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని పద్మావతి సెంటర్ నుంచి రాజరాజేశ్వరి గుడికి వెళ్లే రహదారిలో పరిస్థితి అధ్వానంగా మారింది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– నెల్లూరు(క్రైమ్)

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టర్ ఆనంద్‌ను నగరంలోని ఆయన బంగ్లాలో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఎన్నికలు

నెల్లూరు(అర్బన్): నెల్లూరు కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఎన్నికలను ఆదివారం నిర్వహించనున్నామని పూర్వాధ్యక్షుడు, కార్యదర్శి ఐతా భాస్కర్, పేరూరి ప్రదీప్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగనాయకులపేటలోని ఐరన్ హార్డ్‌వేర్ అండ్ పెయింట్ మర్చంట్స్ అసోసియేషన్ భవన్‌లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎన్నికలను నిర్వహించనున్నామని చెప్పారు. ఓటేసేందుకు వచ్చే వారు తమ పేరుపై ఉన్న లైసెన్స్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను తీసుకురావాలని కోరారు.

దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలి

నెల్లూరు(బృందావనం): దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చి వారికి సామాజిక న్యాయం జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ దళిత్ క్రిస్టియన్ సౌతిండియా కో ఆర్డినేటర్ ఇసుకల జయరాజ్ తెలిపారు. ఈ మేరకు పద్మావతి సెంటర్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఎన్నో ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్నా, న్యాయం జరగకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు

నెల్లూరు(బృందావనం): కోదండరామపురంలోని మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పల్లకిసేవను నిర్వహించారు. అభిషేకం, పూర్ణాహుతి, మహాకుంభాభిషేకం, వసంతోత్సవం తదితరాలను జరిపారు. భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. ఉభయకర్తలుగా కాటేపల్లి వెంకటరమణయ్య, సరిత దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ చైర్మన్ పత్తి నరసింహులు, సభ్యులు నారాయణరెడ్డి, చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులు, గోవిందరాజులు, వీరరాఘవులు, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు సిటీ: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నెల్లూరు – జొన్నవాడ రోడ్డులోని పొట్టేపాళెం సమీపంలో శనివారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. పొట్టేపాళెం సమీపంలో రోడ్డు పక్కన 35 నుంచి 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉన్నారు. స్థానికులు గమనించి వీఆర్వోకు సమాచారమిచ్చారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జన్మభూమి కమిటీలతో ప్రమాదం


మాట్లాడుతున్న ఆంజనేయరెడ్డి

- టీడీపీ నేతలు కొల్లగొడుతున్న సహజ వనరులను కాపాడాలి
- వైఎస్సార్సీపీయే రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి

నెల్లూరు(బారకాసు): జన్మభూమి కమిటీల ఏర్పాటుతో పెద్ద ప్రమాదం ఉంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. జన్మభూమి కమిటీలతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితి ఉంటుందని చెప్పారు. ఈ విషయమై సీఎం చంద్రబాబు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. టీడీపీ నేతలు కొల్లగొడుతున్న సహజ వనరులను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ కక్షలు పక్కనబెట్టి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని.. ఆ పార్టీకి భవిష్యత్తు లేదని చెప్పేందుకు వీల్లేదన్నారు. సీట్లు తగ్గినా ప్రజాబలం ఉందని, ఎవరు ఏమన్నా.. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయేనని స్పష్టం చేశారు. కొత్తూరు రామకోటయ్యనగర్, సుజాతమ్మ పాల్టీ కాంప్లెక్స్ వద్ద నిర్మిస్తున్న అక్రమ మసీదు కట్టడాన్ని వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు. దీని నిర్మాణానికి రూ.2.5 లక్షల విరాళాన్ని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఇచ్చారని, ఓట్ల కోసం ఇంత దిగజారుతారానని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, నేతలు ముక్కు రాధాకృష్ణ, గిరికుమార్‌గౌడ్ ప్రవీణ్‌కుమార్, రాజేష్, రాజశేఖర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, హజరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

• ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయులు కాపాడుకోవాలని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని పురమందిరంలో శనివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) విద్యా, వైజ్ఞానిక జిల్లా మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. గతంలోని లోటుపాట్లను సరిచేసుకొని ముందుకెళ్లాలని, ఈ విషయంలో ఏపీటీఎఫ్‌తో కలిసి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. పంచాయతీకి ఒక పాఠశాలను ఏర్పాటు చేసి గుణాత్మక విద్యను అందించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని సూచించారు. వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో విద్యార్థుల్లో హింసా ప్రవృత్తి, విపరీత ధోరణులు పెరగకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, చూడాలని కోరారు. సాంకేతిక విజ్ఞానాన్ని మంచికి మాత్రమే వినియోగించుకునేలా చూడాలని సూచించారు. పేద విద్యార్థులకు తన వంతు సేవలందిస్తున్న సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డిని సత్కరించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి, రాష్ట్ర, జిల్లా బాధ్యులు రియాజ్, పిచ్చిబాబు, కృష్ణారెడ్డి, జుల్ఫికర్ అలీ, శివకోటారెడ్డి, కోటేశ్వరరావు, తిరుపతిరెడ్డి, బాలాత్రిపురసుందరి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి


హాజరైన ఉపాధ్యాయులు

క్లుప్తంగా

వేదగిరిలో విశేష పూజలు



నెల్లూరు సిటీ: కల్కి జయంతిని పురస్కరించుకొని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన మార్గంలోని కల్కి అవతారం వద్ద ప్రత్యేక పూజలను శనివారం నిర్వహించారు. కాగా స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారికి అభిషేకం, తిరుప్పావై సేవ తదితర పూజలను ఆదివారం నిర్వహించనున్నారు. ఇన్‌చార్జి ఈఓ సుధీర్, ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేయాలి

• ఈఓపీఆర్డీ డేవిడ్


మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ డేవిడ్

కొడవలూరు: గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని ఈఓపీఆర్డీ వి.డేవిడ్ స్పష్టం చేశారు. మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడురోజులుగా జరుగుతున్న శిక్షణ శనివారంతో ముగిసింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో చేయాల్సిన పనుల గురించి శిక్షణలో సమగ్రంగా వివరించడం జరిగిందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.రమేష్ మాట్లాడుతూ పంచాయతీల్లో తాగునీటి పథకాల నిర్వహణ ప్రధానమైందన్నారు. ఏవైనా పైపులైన్లు, పంపు షెడ్లు మరమ్మతులకు గురైతే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా నీటి పథకాల నిర్వహణ సాగాలని కోరారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా త్వరలోనే ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి సదుపాయం ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ సురేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

• **కోవూరు:** గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు కృషి చేయాలని పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర పరిశీలకురాలు రాజ్యలక్ష్మి తెలిపారు. కోవూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామంజనేయులు, ఈఓపీఆర్డీ నాగూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నేతల బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీలో యూటీఎఫ్ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం దాని సభ్యులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్కు సెంటర్ వద్ద యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో యూటీఎఫ్ విశేష కృషి చేసిందని పలువురు వక్తలు అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు నాగిరెడ్డి, శ్రావణ్‌కుమార్, మాల్యాద్రి, వాణి, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

• **కోవూరు:** యూటీఎఫ్ నాయకులు మండలంలో శనివారం ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. వివిధ చోట్ల పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహించారు. కోవూరు ఏరియా ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఖాజావలీ, భారతి, నాయకులు తిరుపాలు, మాలకొండయ్య,, రవిచంద్ర, రమేష్, వెంకటేశ్వర్లు సుబ్బారావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు నాగభూషణం, జయప్రకాష్ పాల్గొన్నారు.

ఎంపీడీఓకు ఘన సన్మానం

కొడవలూరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తూ ప్రకాశం జిల్లా పర్చూరుకు బదిలీ అయిన వి.ప్రద్యుమ్నకుమార్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఈయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. తాజాగా యథాస్థానానికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిన విషయం తెల్సిందే. దీంతో ప్రద్యుమ్నకుమార్ రిలీవయ్యారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శిలు, డీఏలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఓ సీహెచ్‌ఎస్.లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.రమేష్, ఈఓపీఆర్డీ వి.డేవిడ్, సూపరింటెండెంట్ సురేష్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శిలు డి.సురేష్‌కుమార్, జి.జాలయ్య, అంకమరాణి, విజయలక్ష్మి, బ్రహ్మానందరెడ్డి, సురేష్, కార్యాలయ సిబ్బంది శీనమ్మ, వెంకటేష్, శీనయ్య పాల్గొన్నారు.